# 'నాలో నేను'

— ప్రయోగ రామకృష్ణ

—జీవితం కంటే మృత్యువుకే మన మీద అధికారం హెచ్చు....

అమ్మమ్మ పోయి మూడేళ్ళవుతోంది. చాల భారీ విగ్రహం ఆవిడది. చామన చాయలో వుండేది. డెబ్బయ్యో యేడు సమీపిస్తోందనంగానో ఏమో పోయింది. తింటానికి, ఉంటానికి లోటు లేకపోయినా బ్రతికినన్నాళ్ళూ దిగుళ్ళతో బ్రతికింది. మంచంలో ఎక్కువ రోజులు లేదు కాని చివర చివరన మరణవేదన అనుభవించింది. ఒకే ఒక కూతురు ఒకే ఒక కొడుకూను ఆవిడకు. కొడుకు దగ్గరే సలక్షణంగా ప్రాణాలు వదిలింది. ఆవిడపోయిన పది నిముషాలకో ఏమో మామయ్యొచ్చి చెప్పారు 'అమ్మమ్మ పోయిందిరా అని'. నేను వాళ్ళింటికి నాలుగిళ్ళవతలున్నాను. నాలుగు వేల మైళ్ళ దూరంలో ఎందుకులేకపోయానా అనిపించింది.

వలభై ఏళ్ళ మామయ్యలో పదేళ్ళ చిన్నపిల్లాడ్ని చూసాను నేనాక్షణాన.

తల్లిని పోగొట్టుకున్నవాళ్ళ ఎవరి గతైనా అంతేనేమో...

మామయ్య గొంతులో జీర

కళ్ళల్లో తడి

మామయ్యను దగ్గరకు తీసుకుని ఓదార్చాలనిపించింది.

తాతయ్య ఆ రాత్రెందుకో నా గది కొచ్చి పడుకున్నారు. 'ఈ విషయం ఆయనతో హఠాత్తుగా చెప్పకు. పెద వాడు' అని మామయ్యెళ్ళిపోయారు.

తెలీకుండా ఎలా వుంటుంది, అర్ధ రాత్రి పన్నెండింటికి మామయ్యొచ్చి నిద్దరలేపితే....

చెప్పాను. చెప్పక తప్పిందికాదు. పదమూడో ఏటే ఏమో కాపరానికి వచ్చిందిట అమ్మమ్మ. ఒకేదా రెండేళ్ళా యాభై ఏళ్ళు ఇద్దరూ ఒకటై జీవితాన్ని పంచుకుని, కష్ట సుఖాలు కలబోసుకుని, హృదయాలు విప్పుకుని ఒకరి సుఖం కోసం మరొకరు అనురాగాల గొడుగులు పట్టి ఆనందం కురిపించుకుని పరస్పరం జీవితాన్ని నిత్యహరితం చేసుకుంటూ వస్తే-యింతకాలానికి ఆ అనుబంధం చటుక్కున తెగిపోయింది.

'చివరి క్షణంలో దానిదగ్గర లేక

పోయానే' అని బాధపడ్డాడు తాతయ్య.

'వుంటే ఏమన్నా చెప్పేదేమో' అన్నాడు.

అన్నేళ్ళొచ్చిన తాతయ్యకూడఅన్నీ తెలిసి కంట తడి పెట్టాడు.

సృష్టి రహస్యం అగోచరం.

అంత విగ్రహాన్ని, అరవై ఏళ్ళ స్త్రీత్వపు చిహ్నాల్ని, అనురాగాన్ని మళ్ళీ కనిపించకుండా మట్టి చేసొచ్చారు.

ఎంత నిర్దయ.

అందరూ అంతే చివరికి. బ్రతికిన నాలుగురోజులే ఈ అధికారాలు, హోదాలు, పంతాలు, పట్టింపులు అన్నీను.

అమ్మమ్మను గోడకానించి స్నానం చేయించారు. అప్పుడూ సజీవంగానే వున్నట్టనిపించింది. చెవులో తులసి తీర్థంపోసి నారాయణ మంత్రంచెప్తుంటే మామయ్య "చాలురా నాయనా ఈజన్మకిదిచాలు" అని చిరునవ్వు నవ్వినట్టే వుంది.

చాల పట్టుదల వున్నమనిషి

అలాగే మనసులో వున్నదేదోకుండ బద్దలు కొట్టినట్టు చెప్పేది.

నేనంటే ఆవిడకు ప్రాణం.

కూతురు కాపరం కూలిపోయిందని, నేను పైకొచ్చి నాలుగు రాళ్ళు సంపాదిస్తే చూడాలని మహా తాపత్రయ పడింది. నేను నా చిన్నప్పటి నుంచీ ఆవిడ దగ్గరే పెరిగాను. అమ్మకన్నా అమ్మమ్మదగ్గర చనువెక్కువ నాకు. పటికబెల్లం ముక్క దగ్గరనుంచీ దాచి వుంచి మరీ ఇచ్చేదినాకు. నేను ఉద్యోగంలో చేరాకనే పోయిందావిడ. కాబట్టి కూతురు సంసారం ముందు ముందు ఇంకేమిటో అని దిగులు పడకుండా పోయుండాలి. అదీ అదృష్టం నాకు.

అమ్మమ్మను తీసుకువెళ్తున్నారు.

అందర్నీ వచ్చి ఆవిడ చుట్టూ ప్రదక్షిణం చేసి

ఇంకెప్పుడూ కనిపించదు కాబట్టి చివరిసారిగా చూసి నమస్కారంచేయండన్నారు. ఒక్కొక్కరే వెళుతున్నారు. నేను మాత్రం వరండాలో కిటికీచువ్వలు పట్టుకుని భోరున ఏడుస్తున్నాను. బయటకువెళ్ళి ఆవిడ్ని అలా చూసే ధైర్యం నాకులేదు. ఎక్కడికో పారిపోవాలని పిస్తోంది. ఎవరికీ కనిపించనంత దూరంగా, ఎక్కడో ఏ శిఖరం మీదనో నిలబడి గట్టిగా గుండెలవిసిపోయేలా ఏడవాలనుంది. యెవరికీ వినిపించనంత గట్టిగా.

నా ఏడుపు అమ్మమ్మకు వినిపించదా.

వినిపిస్తే ఒక్కసారంటే ఒక్కసారైనావచ్చి నా కన్నీళ్ళు తుడవదూ....

నా మీద ప్రేమంతా అప్పుడే ఇంకిపోయిందా.

సగం ఏడుపు సగం ఆలోచన

అమ్మమ్మ కనిపించకుండా పోయింది.

ఎవరి కన్నీళ్ళు ఆవిడ్ని ఆపలేకపోయాయి, చివరికి నా కన్నీళ్లు కూడ...

అనామిక

మృత్యువు కెంతధికారం ఈ మనిషి మీద.

వాళ్లనేను చాలాసార్లు తర్కించుకున్నాను "ఎందుకు పెరగడం లేదూ మనిషి ఆయుర్దాయం" అని....

ఎక్కడో చదివాను: మనిషి యోగనిష్ఠాతుడైతే ఈ శరీరంతోనే ఎక్కువ కాలం వుండాలనుకుంటాడు. ఉంటాడు కూడాను. కొన్నేళ్ళపాటు జీవించిన యోగులు వున్నారు. కాని, వారు మనుష్యులే. ఈశ్వర దర్శనం కోసం చేసే యాత్రలో మళ్ళీ మళ్ళీ జన్మెత్తడం, కొంతకాలం వృధాకావడం ఇష్టంలేక వున్న శరీరంతోనే అలా వుండిపోయారు. కాని, ఋషులు, దేవతలు, జ్ఞానులు అలాకాదు. వారు ఎక్కువ రోజులుండాలనుకోరు. వచ్చిన పని త్వరగా చూసుకుని వెళ్ళిపోతారు.

మరి అమ్మమ్మ—

ఏమో, ఆవిడ అలానే అనుకుందేమో, తమస్సులోంచి జ్యోతి లోకి వెళ్ళింది.

నేను మాత్రం ఒక్కడ్నీ ఇక్కడ ఒంటరిగా చీకటిలో, అమ్మమ్మకు, అమ్మమ్మ అనురాగానికి దూరంగా, ఏముందేం లాభం ఆవిడ అమృత హస్తం కనుమరుగైన తరువాత. అన్నీ వుండి ఏమీలేని దరిద్రుడ్ని నేను.

---


"అనామిక"

చందా వివరములు

| | |
|---|---|
| విడి ప్రతి | రు. 2–50 |
| స్పెషల్ | 5–00 |

రు. 27=50+5=32=50 పె=లు

సంవత్సరం చందా చెల్లించు వారికి రు. 30 లకే సంవత్సర పత్రికలను పంపగలము.